## క్లుప్తంగా

### రోడ్లపై చెత్త వేస్తే రూ.1000 జరిమానా



రోడ్లపై చెత్తను తొలగింపజేసిన కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్

**కాచిగూడ:** రోడ్లపై ఇష్టానుసారంగా చెత్తను వేస్తే రూ.1000 జరిమానా విధిస్తామని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ హెచ్చరించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి రోడ్లపై పేరుకుపోయిన చెత్త, చెదారాలను తొలగింపజేసి బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే రూ.1000 జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. బస్తీల్లో పర్యటించి రోడ్లపై చెత్త వేయవద్దని కోరుతూ.. ప్రజలకు అవగాహన కల్పించారు.

◆ ఇంటి వద్దకు వచ్చే చెత్త రిక్షాలు, ఆటో ట్రాలీ సిబ్బందికి మాత్రమే చెత్తను వేయాలని సూచించారు.

◆ రోడ్లపై ఇష్టానుసారంగా చెత్తను పారవేసి పరిసరాలను అపరిశుభ్రం చేయవద్దన్నారు. పేరుకుపోయిన చెత్తతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలకు వివరించారు. జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎస్ తిరుపతి, యాదయ్య, శంకర్, మల్లికార్జున్, భీమ్‌రాజ్, లక్ష్మణ్, రవియాదవ్, రామకృష్ణ, దినేష్ తదితరులున్నారు.

### వేసవిలోపు నాలా పూడికతీత పనులను పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

**అంబర్‌పేట:** వేసవి ముగిసేలోపు నాలాల్లో పూడికతీత పనులను పూర్తిచేయాలని బాగ్‌అంబర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆమె డివిజన్‌లోని వైభవ్‌నగర్, బతుకమ్మ కుంట ప్రాంతాల్లో ఉన్న ప్రధాన నాలా పూడికతీత పనులను క్షేత్రస్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. నాలా పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని లేని పక్షంలో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. 100 రోజుల కార్యక్రమాన్ని డివిజన్‌లో విస్తృతంగా చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకుంటామన్నారు.

### రేషన్ తూకంలో అవినీతి జరగకుండా చర్యలు



రేషన్‌షాప్‌ను తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్

**చిక్కడపల్లి:** రేషన్ సరుకుల నాణ్యత, తూకంలో అవినీతి జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మలయాళం చర్చి సమీపంలోని రేషన్‌షాప్ 627ను సోషల్ ఆడిట్‌లో భాగంగా విజిలెన్స్ కమిటీ సభ్యురాలి హోదాలో అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రేషన్‌కార్డుతో లబ్ధి పొందాల్సిన సరుకుల నాణ్యత, తూకంలో పలు సమస్యలపై ఆరా తీశారు. ప్రతి నెలా సరుకులతోపాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న గరీబ్ కల్యాణ యోజన పథకం కింద ఉచితంగా 5 కిలోల బియ్యం అదనంగా అందిస్తున్నారన్నారు. బీజేపీ నగర యువ నేత ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, కృష్ణప్రసాద్, శ్రీకాంత్, కార్తిక్, వీరకాంతి, పౌరసరఫరాలశాఖ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ రాకేష్, రేషన్‌షాప్ డీలర్ శేఖర్ స్థానిక మహిళలు పాల్గొన్నారు.

### విశాఖ ఎక్స్‌ప్రెస్ రైల్లో ల్యాప్‌టాప్ చోరీ

**కాచిగూడ:** విశాఖ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి ల్యాప్ టాప్ చోరీకి గురైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన వెంకట్‌రావు (35) విశాఖపట్నం నుంచి కాచిగూడకు విశాఖ ఎక్స్‌ప్రెస్ రైల్లో వస్తుండగా.. డోర్నకల్ రైల్వేస్టేషన్ వద్ద ల్యాప్‌టాప్ చోరికి గురైంది. దీంతో బాధితుడు మంగళవారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం డోర్నకల్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

### 23న పరశురామ జన్మోత్సవం

**ముషీరాబాద్:** పరశురామ జన్మోత్సవాన్ని ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు రాంనగర్ గుండు అడిక్‌మెట్ డివిజన్ బ్రాహ్మణ సమైఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శేషసాయి ప్రకటించారు.

# షెల్టర్లు లేని బస్టాప్‌లు.. !



6 నంబరు చౌరస్తాలో..

మండుటెండలో బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎండదాటికి తట్టులేక.. బస్టాపుల్లో నిలబడలేకపోతున్నారు. ఉదయం 11 దాటితే బస్టాప్‌లలో బస్సు కోసం వేచి చూసే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

- వేసవిలో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- నత్తనడకన శివం రోడ్డు ఏసీ బస్టాప్ షెల్టర్ పనులు

**అంబర్‌పేట:** నియోజకవర్గంలోని కొన్ని బస్టాపుల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సివస్తోంది. బస్సులపై ఆధారపడి రాకపోకలు సాగించే సామాన్య ప్రయాణికులు వేసవిలో ప్రయాణం చేయడానికి జంకుతున్నారు. బస్టాపులు ఏర్పాటు చేసి అక్కడ బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.

**నడిపేది ఒకరు ఏర్పాటు చేసేది మరొకరు...**

ప్రజా రవాణా కోసం బస్టాపులను నిర్దేశించేది ఆర్టీసీ వారు కాగా.. షెల్టర్లను ఏర్పాటు, బస్టాప్ షెల్టర్ల నిర్వాహణ సైతం జీహెచ్‌ఎంసీదే. ఆర్టీసీ విభాగం ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని బస్టాప్‌ను ఏర్పాటు చేస్తుంది. బస్సు షెల్టర్ వంటి సౌకర్యాలు కల్పించాల్సిన జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ నియోజకవర్గంలోని శ్రీరమణ చౌరస్తా మహంకాళి ఆలయం, తిలక్‌నగర్ రోడ్డులోని రెండు బస్టాపులు, శివం రోడ్డులోని రెండు బస్టాపులు, కాచిగూడ కమ్మేళ, అలీకేఫ్ చౌరస్తా, అంబర్‌పేట ప్రధాన రోడ్డు గాంధీ చౌరస్తా ప్రాంతాల్లో బస్సు స్టాపులు ఉన్నప్పటికీ బస్‌షెల్టర్లు లేవు. ఇప్పటికైనా ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ సమన్వయంతో బస్టాపుల్లో బస్‌షెల్టర్లు లేని ప్రాంతాలను గుర్తించి తక్షణమే బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**ఎండాకాలం పోయాకా ఏసీ బస్టాపా..**

శివం రోడ్డులో అన్ని హంగులతో ఏసీ బస్టాప్ ఏర్పాటుకు అధికారులు గతంలో పనులు ప్రారంభించారు. ఎండాకాలం వచ్చినా పనులు ఇప్పటికి పూర్తి కాలేదు. మరో నెల రోజులు గడిస్తే దాదాపు వేసవికాలం పూర్తి అవుతుంది. ఎండాకాలం పోయాకా ఏసీ బస్టాపు అందుబాటులోకి వస్తుందా.. ? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏసీ బస్టాప్ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇప్పటి దాకా అందుబాటులోకి రాలేదు. ఎండాకాలంలో ఏసీ బస్టాప్ లేకుండా అధికార యంత్రాంగం వానకాలంలో అందుబాటులోకి తెచ్చేలా వారి చర్యలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఏసీ బస్టాప్‌లను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



శివం రోడ్డులో నిలిచిపోయిన ఏసీ బస్టాప్ పనులు

## రూ. 49 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**నల్లకుంట:** డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో దశలవారీగా నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. దశాబ్దాల క్రితం నాటి జనాభాకు అనుగుణంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ చాలా ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిందని, దీంతో తరుచూ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆయా ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. మంగళవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని స్ట్రీట్ నంబర్–7లో రూ. 49 లక్షలతో నూతనంగా చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

◆ వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి, కలుషిత నీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జలమండలి అధికారులకు సూచించారు.

◆ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించి ప్రజలకు ఇబ్బందులకు కలుగకుండా చూడాలన్నారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకుడు ఎం. భూపతినాథ్, రాముయాదవ్, బీజేపీ నగర నాయకులు ఎంబీ. కిశోర్ కుమార్, కేజీ బాబు, లక్ష్మణ్ కుమార్, మధుసూదన్ తదితరులున్నారు.

## మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ విద్యావేత్త చుక్క రామయ్య పర్యవేక్షణలో ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహించే మోడల్ ఎంసెట్, మోడల్ నీట్ పరీక్షలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, నాగరాజులు పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 18 ఏళ్ల నుంచి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 300 కేంద్రాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ పరీక్షల్లో విజయం సాధించిన మొదటి పదిమంది విద్యార్థులకు గోల్డ్ మెడల్ అందిస్తామన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రతిభను వెలికి తీసేందుకే 'ఇన్నోవేషన్ కాంపిటీషన్'



విజేతలకు బైక్‌లను ప్రదానం చేస్తున్న దృశ్యం

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇన్నోవేషన్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని గోకరాజు గంగరాజు ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఇందిరా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఎస్.సరస్వతీలు తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిగ్రీ ఐడియా ఇన్నోవేషన్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బైక్‌లు ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తు ప్రణాళికతో వ్యాపార రంగంలో ఎదిగేందుకు ఈ కాంపిటీషన్ దోహదం చేస్తుందన్నారు. కొత్త ఆవిష్కరణలతో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టవచ్చన్నారు. అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ రిషికాంత్, డాక్టర్ ఎం.రత్న, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయేందర్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజు తదితరులున్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళల ధర్నా



వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట నిరసనలో పాల్గొన్న మహిళలు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌లో గత వారం రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని బాగ్‌లింగంపల్లిలోని వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట మహిళలు మంగళవారం నిరసన చేపట్టారు. గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగుతూ.. కలుషిత తాగునీటి సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా డివిజన్‌లోని పలు బస్తీల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లోప్రెషర్‌తో తాగునీరు సరఫరా అవుతోందని దీనికి తోడు అరగంటే నీటి సరఫరా కావడంతో నీరు సరిపోవడం లేదన్నారు. అధికారులు ఇష్టానుసారంగా నీటిని సరఫరా చేయడం ద్వారా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## అలరించిన సినీగీత విభావరి



సన్మానిస్తున్న దైవజ్ఞశర్మ, వేణుప్రక్కి

**చిక్కడపల్లి:** మైటీ మ్యూజికల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు, హిందీ సినీ గీతాల విభావరి అలరించింది. మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో గాయకుడు, నిర్వాహకులు వేణుతో పాటు ఇంద్రాణి గోసాల, రమాదేవి వేటూరి, వరూణిక ప్రక్కి, వాసంతిక ప్రక్కి, విశ్వానిక ప్రక్కి, ఉమామహేష్, జలజ, హరివిమల, సాయిపావని, మానస, వెంకటరత్నం, రఘు, బాల్‌రాజు, వేణూరి మణి తదితరులు గీతాలతో ఆలపించారు. ఈ సందర్భంగా సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ పాల్గొని ఘంటసాల గానసభ అధ్యక్షుడు కేవీరావును సన్మానించారు.

## సీపీఐ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు తదితర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపిస్తూ.. సీపీఐ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. 'దేశ సంపదను కార్పొరేట్‌లకు అమ్ముతున్న కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని' ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేష్, నగర సహాయ కార్యదర్శి యాదగిరి పిలుపునిచ్చారు. 'బీజేపీ హటావో.. దేశ్‌కు బచావో' పేరిట సీపీఐ రాష్ట్ర కమిటీ ప్రచారం చేపట్టింది. మంగళవారం సీపీఐ ముషీరాబాద్ నియోజకవర్గ కార్యదర్శి వెంకటస్వామిగౌడ్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికి అమలు చేయడం లేదని విమర్శించారు. ముషీరాబాద్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి సురేందర్, సీహెచ్ శ్రీనివాస్, ఉపేందర్, రాములు, శేఖర్, రవి, రాజేందర్, ఆనంద్ తదితరులున్నారు.

**అంబర్‌పేట:** మతపరమైన రాజకీయాలు భారత దేశ సమగ్రతకు ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్.బోస్, నర్సింహాలు అన్నారు. మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గంలో 'బీజేపీ హఠావ్ – దేశ్ బచావో' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'ఎంఐఎం, బీజేపీ పార్టీలు చేస్తున్న మత రాజకీయాలను ప్రజలు గమనించాలని' వారు కోరారు. మత రాజకీయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ.. స్థానికంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అధిక ధరలను నియంత్రించలేని కేంద్ర ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సీపీఐ నాయకులు వెంకటేశం, యాదగిరి, ఆర్.మల్లేష్, రాజుగౌడ్, కృష్ణగౌడ్, లతీఫ్, జె.కుమార్ తదితరులున్నారు.

## నిరుద్యోగ దీక్షకు తరలిన టీజేఎస్ నేతలు



నిరుద్యోగ గోస దీక్షకు బయలుదేరిన టీజేఎస్ నేతలు

**చిక్కడపల్లి:** టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని టీజేఎస్ నగర అధ్యక్షుడు ఎం.నరసయ్య డిమాండ్ చేశారు. అఖిలపక్ష నేతల ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద చేపట్టిన నిరుద్యోగ నిరసన దీక్షకు గాంధీనగర్ డివిజన్ నుంచి ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా అశోక్‌నగర్, అరుంధతినగర్ బస్తీ వద్ద ర్యాలీని ప్రారంభించి నరసయ్య మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన 8 ఏళ్లకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం ఏ ఒక్క పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేదని విమర్శించారు. దోషులను కఠినంగా శిక్షించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని పరీక్ష రాసిన ప్రతి నిరుద్యోగులకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ గుండెల్లి రవీందర్‌యాదవ్, అంజయ్‌గౌడ్, వెంకటయ్య, సంపత్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**ముషీరాబాద్:** 'నిరుద్యోగుల గోస–అఖిల పక్షం భరోసా' పేరుతో ఇందిరాపార్కు వద్ద జరిగిన నిరసన దీక్షకు ముషీరాబాద్ నియోజకర్గం నుంచి తెలంగాణ జన సమితి నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్, గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జనసమితి అధ్యక్షులు ఎం.నర్సయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ నిరసన దీక్షలో పాల్గొని నిరుద్యోగులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. చిక్కడపల్లి, గాంధీనగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో వేలాది మంది నిరుద్యోగులు హరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5 భోజనం తింటూ ఉద్యోగాల కోసం చదువుతుంటే ప్రభుత్వ పెద్దలు పేపర్ లీకేజీలు చేసి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌యాదవ్, అజయ్‌గౌడ్, సుధాకర్, జైపాల్‌రెడ్డి, వెంకటయ్య తదితరులున్నారు.

## 'నిత్య జనగణమన'ను స్ఫూర్తిగా తీసుకోవాలి

**నల్లకుంట:** 'నిత్య జగనగణమన'ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఇక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి, జాతీయ గీతాన్ని ఆలపించి దేశ భక్తిని చాటాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం నల్లకుంట శివానందనగర్‌లో జరిగిన నిత్య జనగనమన కార్యక్రమానికి హాజరైన ఆయన మువ్వన్నెల జెండాను ఎగుర వేసి జాతీయ గీతాన్ని ఆలపించి మాట్లాడారు. గత 320 రోజులకు పైగా నిత్యం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపడుతున్న నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం విజయేందర్‌రెడ్డి ప్రపంచ వారసత్వ దినోత్సవంపై ప్రసంగించారు. నిత్య జనగణమన నిర్వాహకులు నేలంటి మధు, మల్లాది క్రాంతి, జూకంటి ప్రశాంత్, వందే ప్రజా శ్రీనివాస్, ఉపేంద్ర ప్రసాద్ దూబే తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

**చిక్కడపల్లి:** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గురుసిద్ధ మణికంఠ శివచార్య మహాస్వామి అన్నారు. గాంధీనగర్ డివిజన్ బాపునగర్‌లోని రాజరాజేశ్వరి దేవాలయం 39వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన శివచార్య మహాస్వామి మాట్లాడుతూ.. సేవగుణం, నిస్వార్థంగా భక్తితో భగవంతుని ఆరాధిస్తే అన్ని విజయాలే కలుగుతాయన్నారు. ఉత్తర పీఠాధిపతి దత్త కార్తికేయ దేవర స్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావనను పెంపొందించుకోవాలని అప్పుడే సన్మార్గం వైపు ప్రయాణిస్తారని సూచించారు. కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ దంపతులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, బీజేపీ నగర నాయకుడు వినయ్‌కుమార్ తదితరులున్నారు.

## 'గ్రాండ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్' దరఖాస్తులకు ఆహ్వానం

**నల్లకుంట:** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (ఎన్‌ఐఎఫ్‌డీ)లో ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియల్ డిజైనింగ్, ఫోటోగ్రఫీ తదితర కోర్సుల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు అర్హులైన వారిని ఎంపిక చేసుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ రాముయాదవ్ ప్రకటించారు. మంగళవారం నల్లకుంటలోని ఎన్‌ఐఎఫ్‌డీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గ్రాండ్ టెస్ట్ వివరాలను వెల్లడించారు. దరఖాస్తు చేసుకునేందుకు మే 20న చివరి తేదీ అని చెప్పారు. మే 21న గ్రాండ్ మెరిట్ పరీక్ష ఉంటుందన్నారు. తమ సంస్థలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్న డిగ్రీ, పీజీ, అడ్వాన్స్‌డ్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కోర్సుల్లో చేరి శిక్షణ పొందుతున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించేందుకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించి పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేస్తున్నామన్నామన్నారు.

## రైల్వే స్టేషన్‌లో ఏసీ డార్మిటరీ, విశ్రాంతి గదులు ప్రారంభం

**కాచిగూడ:** రైల్వే ప్రయాణీకులకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ శరత్ చంద్రయాన్ తెలిపారు. మంగళవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 'ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏసీ డార్మిటరీ, విశ్రాంతి గదులను ఆయన ప్రారంభించారు. రైల్వే అధికారులు పి.రాజ్‌కుమార్, వై. బాలాజీ కిరణ్, ప్రభుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికలను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించొద్దు

కాటికాపరి వృత్తిదారుల డిమాండ్



ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన చేపడుతున్న దృశ్యం

**కవాడిగూడ:** రాష్ట్ర ప్రభుత్వం హిందూ శ్మశానవాటికలను అభివృద్ధి చేసి కాటికాపరి కులస్తులకు అప్పగించాలని గ్రేటర్ హైదరాబాద్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాల కాటికాపరి వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో సంఘం ఆధ్వర్యంలో 'కాటికాపరులకు న్యాయం చేయాలని' డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి పద్మాకర్, కోశాధికారి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. తరతరాలుగా కాటికాపరి వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వృత్తిదారులకు చెందాల్సిన హిందూ శ్మశానవాటికలను ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు అప్పగించవద్దని తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 'కాటి కాపరి వృత్తి నుంచి మమల్ని వేరు చేయవద్దు' అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వృత్తిదారులకు కలెక్టర్ ద్వారా గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. హిందూ శ్మశానవాటికలు కబ్జాకు గురికాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వృత్తిదారులకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని పేర్కొన్నారు. సంఘం నేతలు సత్యనారాయణ, రమేష్, జగన్, కన్నయ్య, రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**కవాడిగూడ:** పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకుని మతసామరస్యాన్ని పెంపొందించుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి అన్నారు. మంగళవారం భోలక్‌పూర్‌లోని అంజుమన్ ఫంక్షన్‌హాల్‌లో నదీమ్‌గౌస్ ఖాజా రజాక్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి పోలీసులు సామూహిక ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి ముస్లిం మత పెద్దలకు ఖర్జుర పండ్లు తినిపించి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ అధ్యక్షులు సోహెల్ రజా మాట్లాడుతూ.. తమ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్, సోమశేఖర్, అక్లాక్ హుస్సేన్, సొసైటీ కార్యదర్శి నయీం, కన్వీనర్ అన్వర్, ఇర్ఫాన్, రియాజ్ తదితరులున్నారు.

**ముషీరాబాద్:** అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్‌లో బీఆర్‌ఎస్ ముస్లిం మైనార్టీ నాయకుడు ఖలీల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. నల్లకుంట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మోగిలిచర్ల రవి, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ అస్లాం, సురేందర్, నేత శ్రీనివాస్, మహ్మద్ అహ్మద్, రాజు, ప్రవీణ్ తదితరులు హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

